క్లుప్తంగా

నీలమణి దుర్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు



క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అషాఢ మాసం సందర్భంగా అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు చేసి ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు చేశారు.

భక్తితో ముక్తికి మార్గం



మాట్లాడుతున్న భీమారావు

నరసన్నపేట: జీవన్మరణ సమస్యలతో సతమతమవుతున్న మానవుడు భక్తి మార్గం అవలంబించాలని ప్రజ్ఞాన విలక్షణ బైపల్లి భీమారావు అన్నారు. మండలంలోని గునబుపేట ఆశ్రమంలో ఆదివారం సత్సంగ సభ నిర్వహించారు. భీమారావు మాట్లాడుతూ భగవద్గీత, రామాయణం, భారతం, ఉపనిషత్తులు, వేదాలు, పురాణాలు వంటివి చదవడం ద్వారా భగవంతుని గురించి తెలుసుకోవచ్చన్నారు. భక్తి మార్గాల్లో ఉన్న రహస్యాలను సద్గురువుల ద్వారా తెలుసుకోవాలని సూచించారు. భగవద్గీతలో కృష్ణ పరమాత్మ అర్జునుడిని బోధించే విధానం గురించి తెలుసుకోవాలన్నారు. అల్లు రామయ్య, అప్పారావు,రమణ, ఎస్.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

మెట్లు నిర్మాణం



మెట్లు నిర్మిస్తున్న దృశ్యం

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ కురిడింగి గ్రామంలో గల కోనేరు వద్ద స్థానికులు మెట్లు నిర్మించుకుంటున్నారు. జాతీయ రహదారి విస్తర్ణ పనుల్లో భాగంగా చెరువుకు ఆనుకుని కల్వర్టు నిర్మాణ చేపట్టారు. గ్రామస్తులు చెరువులో దిగేందుకు ఇబ్బందిగా ఉండటంతో గ్రామస్తులంతా నిధులు సమకూర్చుకుని ప్రస్తుతం మెట్లు నిర్మించుకుంటున్నారు.

చేనేత సొసైటీల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న మంచు చంద్రయ్య

పాతపట్నం: చేనేత సొసైటీలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని వైఎస్సార్ సీపీ వీవర్స్ జిల్లా అధ్యక్షుడు మంచు చంద్రయ్య అన్నారు. ఆదివారం స్వగ్రామమైన కొరసవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సొసైటీని గత కొన్నేళ్లుగా అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే కాగువాడ సొసైటీకి గుర్తింపు తీసుకువచ్చానన్నారు. చేనేత కార్మికుల కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉంటానన్నారు. చేనేత కార్మికుల కోసం ఎల్లప్పుడు కష్ట పడతానన్నారు. తూతిక జనార్దనరావు, సీమ లక్ష్మీనారాయణ, కృష్ణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

రేఖా చిత్రకారుడికి సత్కారం

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లిలోని మణి పాత్రుని క్రియేట్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కాశీబుగ్గకు చెందిన ప్రముఖ రేఖా చిత్రకారుడు బూర్జ కోటీశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంసీఏ అధినేత నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కోటీశ్వరరావుది రేఖా చిత్రంలో అందెవేసిన చేయ్యని కొనియాడారు. అనంతరం చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు చిత్రకళలో మెళకువలను తెలియచేశారు. కార్యక్రమంవో ఎన్టీవీఆర్ మూర్తి, రాణి నాయుడు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.

శ్రీకాకుళం

9912220343

Office mail : sklmadvt@gmail.com

నిరుపయోగంగా

మరుగుదొడ్లు!



కొత్తబస్టాండ్‌ను ఆనుకొని హనుమాన్‌నగర్ ప్రారంభంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



సోమవారం సంత వద్ద పోలాకి రోడ్డుకు ఆనుకొని నిర్మించిన మరుగుదొడ్లు

నరసన్నపేట: ఆరుబయట మలమూత్ర విసర్జన నిర్మూలనలో భాగంగా ప్రజల్లో మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన పెంచేందుకు అధికారులు పలు విధాలుగా కృషి చేశారు. ఇందులో భాగంగా నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో వివిధ ప్రాంతాల్లో మరుగుదొడ్లు నిర్మించారు. అయితే వీటి నిర్వహణ పూర్తిగా కొరవడంతో ఇప్పుడు అవి నిరుపయోగంగా మారి దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లను వృథాగా వదిలేయడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిని ఎవరి ప్రయోజనం కోసం నిర్మించారు? ఇప్పుడు ఎందుకు ఇలా వదిలేశారు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరుగుదొడ్లను వినియోగం లోనికి తీసుకురావాలని, పట్టణంలో ఆరుబయట మలమూత్ర విసర్జన పూర్తిగా నిర్మూలించాలని కోరుతున్నారు. కాగా కొన్ని మరుగుదొడ్లు ఆక్రమణలకు గురవుతుండగా మరికొన్ని శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.



చేపల మార్కెట్ వెనుక పంచాయతీ నిధులతో నిర్మించి వృథాగా ఉన్న మరుగుదొడ్లు



మండల పరిషత్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

ఆర్‌ఎస్‌ఎస్ బలోపేతానికి కృషి



చందా అందజేస్తున్న స్థానిక అభిమానులు

నరసన్నపేట: గ్రామాల్లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ను పటిష్ఠ పరిచేందుకు సంఘ్ కార్యకర్తలు అందరూ కృషి చేయాలని ప్రాంతీయ స్వయం సాలక్ కృష్ణంరాజు అన్నారు. స్థానిక ప్రైవేట్ కళాశాల్లో ఆర్ఎస్ఎస్ ప్రాంతీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుపూజోత్సవం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణంరాజు మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్‌ను మరింత విస్తృత పరచాలన్నారు. గ్రామాల్లో హిందూ ఇజం అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని, భక్తి భావాన్ని ప్రజల్లో పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖండ ప్రముఖ్ పద్మనాభం, సంఘ్ కార్యకర్తలు చింతు పాపారావు, కె.ఎల్.ఎస్.మూర్తి, రామచంద్రరావు, శ్రీధర్, స్థానిక పెద్దలు పాగోటి రాజారావు, జామి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులను కించపర్చడం తగదు



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు కొండబాబు

ఆమదాలవలస: పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పైలా దాస్ అనే వ్యక్తి ఇటీవల సామాజిక మాధ్యమాల్లో బ్రాహ్మణ జాతిని పరుష పదజాలంతో కించపర్చడం ఆయనకు తగదని ఆమదాలవలస మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బల్జేపల్లి వెంకటరమణమూర్తి (కొండబాబు) అన్నారు. మండల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆమదాలవలసలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతినడమే కాకుండా తీవ్ర ఆవేదనకు గురయ్యారన్నారు. అటువంటి నీచమైన పదజాలాన్ని ఖండిస్తున్నామన్నారు. పైలా దాస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సంఘ కార్యదర్శి రమణ మాస్టర్, ఉపాధ్యక్షుడు బలివాడ చిట్టి పంతులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ఇక్కట్లు



దొంకలపర్త వద్ద నిలుపుదల చేసిన భారీ వాహనాలు

బూర్జ: మండలంలోని ఆమదాలవలస – పాలకొండ ప్రధాన రహదారిపై భారీ వాహనాలు నిలుపుదల చేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కువగా ఉప్పినివలస గ్రామం నుంచి సింగన్నపాలెం, సుంకర పేట, దొంకలపర్త–లక్కుపురం గ్రామాల మధ్యలో భారీ వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రహదారిలో భారీ వాహనాలు రాకుండా చూడాలని స్థానిక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్ అరుణ్‌కుమార్

ఆమదాలవలస: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అరుణోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ సంచులకు బదులుగా పేపర్, గుడ్డ, జూట్ సంచులను మాత్రమే వాడడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. ప్లాస్టిక్ సంచులను, గ్లాసులను, ప్లేటులను నిషేధించి ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి రక్షించుకోవాలన్నారు. రిటైర్డ్ చీఫ్ హెల్త్ ఆఫీసర్ బాల లక్ష్మి, పొన్నాడ అప్పలసూరి, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



కొత్తవలస వద్ద ట్రెంచ్ తీయిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మండలం పరిధిలోని వంశధార, నాగావళి నదీ ప్రాంతాల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ వేణుగోపాలరావు హెచ్చరించారు. ఆమదాలవలస మండలం కొత్తవలస వద్ద నాగవళి నదీ ప్రాంతం నుంచి రాత్రి సమయాల్లో ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారని కొందరు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ స్పందించారు. నదీ ప్రాంతానికి వెళ్లే రహదారిలో జేసీబీలతో ఎటువంటి వాహనాలు వెళ్లకుండా ఆదివారం ట్రెంచ్‌లు తీయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎండ్ల బళ్ల ద్వారా ఎవరైనా ఇసుక రవాణా చేసుకోవచ్చని, అయితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి ద్వారా అనుమతి పత్రం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎం.శిరీష , వీఆర్వో రాంబాయి ఉన్నారు.

ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధి నైరా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పి.వి.ఎస్.ఎన్.మూర్తికి అరుదైన గౌరవం లభించింది. భువనేశ్వర్‌లో జ్ఞాన ప్రకాశ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భారతీయ విద్యలో భాష, సంస్కృతిల ప్రభావం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మూర్తి పాల్గొని ప్రసంగించారు. దీంతో ప్రశంసాపత్రం జ్ఞాన ప్రకాశ్ పరివార్ అవార్డును నిర్వహకులు అందజేశారు. శ్రీకాకుళం మండల ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు మూర్తికి అభినందనలు తెలియజేశారు.

విద్యార్థికి అభినందన



గుంటుకు హేమసుందర్‌ను సత్కరిస్తున్న అనపాన రాజశేఖర రెడ్డి

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని రాజావీధికి చెందిన గుంటుకు హేమసుందర్ కొసమాల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. విద్యార్థిని పాతపట్నం మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనపాన రాజశేఖర రెడ్డి ఆదివారం సత్కరించారు. తల్లిదండ్రులు స్వప్న, జగదీశ్వరరావును అభినందించారు.

ఆరుగురు ఎంపిక..

మెళియాపుట్టి మండల కేంద్రానికి చెందిన గుంటుకు జ్యోత్స్న, గుంటుకు హేమసుందర్ (కొసమాల పాఠశాల), జాడుపల్లి గ్రామానికి చెందిన తాడేల నీలిమ, జ్యోత్స్న (జాడుపల్లి), చాపర గ్రామానికి చెందిన పాడి హాసిని, పాడి పవన్ కుమార్ (చాపర) ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరికి ఉపాధ్యాయులు, విద్యావేత్తలు అభినందనలు తెలిపారు.

జీఓ 54ను రద్దు చేయాలి

పొందూరు: జీఓ ఎంఎస్ నంబర్ 54ను కూటమి ప్రభుత్వం వెంటనే రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇవాల్సని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. మోసపూరితంగా వ్యవహరించే విధానాన్ని విడనాడాలని కోరారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం అర్బన్: జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుల పర్యటనలో భాగంగా స్థానిక ఎన్జీఓ హోంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న దారుణాలు, అవినీతిని వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత పాత్రికేయులదేనన్నారు. పాత్రికేయులకు టీడీపీ మొదటి నుంచి సముచితంగా గౌరవిస్తోందని.. కూటమి ప్రభుత్వంలోను అదే గుర్తింపు, గౌరవం కల్పిస్తుందన్నారు. ఇప్పటికే జర్నలిస్టుల హెల్త్ స్కీంను పొడిగించినట్టు పేర్కొన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఏజే జాతీయ నాయకులు జి.ఆంజనేయులు మాట్లాడుతూ.. 13 రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం అమలవుతోందని.. ఇదే తరహాలో ఏపీలో పింఛన్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇచ్చినట్లు సమగ్రమైన విధానాన్ని అమలు చేయాలన్నారు. అక్రిడియేషన్ కమిటీల్లో జర్నలిస్టు సంఘాలకు స్థానం కల్పించాలన్నారు. అనంతరం గాంధీ స్మృతివనంలో ప్రజాకవి గరిమెల్ల సత్యన్నారాయణ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ డబ్ల్యూజేఎఫ్ విశాఖ అర్బన్ అధ్యక్షులు పి.నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, జోగినాయుడు, సత్తారు భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం పేరుతో దగా



- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ఇంట్లో ఎంత మంది పిల్లలు స్కూల్‌కు వెళ్తే అంత మందికి తల్లికి వందనం పథకం పేరుతో ఏడాదికి రూ.15వేలు చొప్పున తల్లి బ్యాంకు ఖాతాలో జమచేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు గొప్పగా చేప్పారని, సీఎం అయ్యాక తల్లికి దగా చేస్తున్నారని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇప్పుడు ఒక్కరిరే వర్తింపజేస్తామని చెప్పి జీవో విడుదల చేసిన ప్రభుత్వం పంగనామాలు పెడుతుందన్నారు. ఆధార్ లింక్ కోసమే జీఓ విడుదల చేశామని ప్రజలను తప్పుదారి పట్టించేలా అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఆధార్ లింక్ కోసం, పథకాల అమలు కోసం ఒక్కొక్క జీవో విడుదల చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను ఆధార్ లింక్‌తో అనుసంధానం అయి ఉన్నాయని గుర్తుచేశారు. అధికార దాహంతో సూపర్ సిక్స్ పేరుతో గొప్పగా ప్రచారం చేసుకున్న చంద్రబాబు.. అధికారం వచ్చిన తరువాత సూపర్ దగా చేస్తున్నారని విమర్శించారు. సమాజాన్ని ఉద్ధరిస్తానని చెప్పిన జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు పథకాల ప్రస్తావన తేవడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర అభివృద్ధి కంటే వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపైన కేసులు నమోదు చేసి కక్ష సాధించేందుకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజలను మోసం చేయటం చంద్రబాబుకు కొత్తేమీ కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఇంతవరకు ఏం చేశారని ప్రశ్నించారు.

గోతులు పూడ్చారు



గోతులను పూడ్చుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

సారవకోట: మండలంలోని అలుదు నుంచి పాకివలస వెళ్లే రోడ్డులో కేలవలస గ్రామ వద్ద ఏర్పడిన గోతులను పూడ్చారు. ఇటీవల సాక్షిలో గోతులు పూడ్చరూ అనే వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఈఓపీఆర్డీ రేణుక సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారు శనివారం రహదారిలోని గోతులను పూడ్చారు.

బలరామ, కృష్ణ అవతారాల్లో జగన్నాథుడు



హిరమండలం: స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ఎల్.ఎన్.పేట: బలరామ అవతారంలో జగన్నాథ స్వామి

హిరమండలం: హిరమండలంలో జగన్నాథ రథయాత్ర వేడుకలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారిని శ్రీకృష్ణుడు, బలరాముడిగా అలంకరించారు. మేజర్ పంచాయతీతోపాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు సురేష్ పాడి ప్రత్యేక పూజలు చేశారు. గుండిచా మందిరంలో పూజలు చేపట్టారు. ఈ రోజు విశిష్టతను అర్చకులు వివరించారు. ఈ రెండు అవతారాల గురించి అవగాహన కల్పించారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో కొలువైన జగన్నాథ స్వామి ఆదివారం బలరామ అవతారంలో దర్శనమిచ్చి భక్తుల నుంచి పూజలు అందుకున్నారు.

దశావతారాల్లో భాగంగా స్వామి వారిని ఆదివారం బలరామ అవతారంలో సిద్ధం చేశామని ఆలయ అర్చకులు వినోద్ కుమార్ పత్రి తెలిపారు. మారు రథయాత్ర వరకు దశావతారాల్లో దర్శనమిచ్చి భక్తుల నుంచి పూజలు అందుకుంటారన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి



కీ.శే. మొయ్య సుందరమ్మ గారు

W/o లేటు లింగన్న, కూర్మనాథపురం

జననం: 01.01.1940. మరణం: 04.07.2024

మంచికి మారు పేరు,
ప్రేమ అనురాగం, ఆప్యాయత,
అనుబంధాలతో ఆదరించిన పుణ్యమూర్తి,
కుటుంబ సభ్యుల, బంధుమిత్రుల శ్రేయస్సును
ఆకాంక్షించి అందరి ఆదరాభిమానాలు పొంది,
అందరి హృదయాలలో సుస్థిర స్థానం పొందిన
మీ మరణం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు
శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..
అశ్రునయనాలతో...

కుమారులు - కోడళ్లు - మనుమలు, మనుమరాండ్రు

మొయ్య జగన్నాథం (లేటు) - జయమ్మ - మొయ్య గోవిందరాజులు - సుజాత, Financial Services, SBI-CSP

మొయ్య అప్పలనాయుడు - ముత్యాలమ్మ - పాగోటి రమణమ్మ - శ్రీను, Agriculturist; చిన్నాల జ్యోతి - శేఖర్, Indian Rly., VSP; బలగ రోహిణి - రమణ, Manager, Deccan Fine Chemicals Ltd., Tuni

మొయ్య సత్యనారాయణ - అన్నపూర్ణ - మొయ్య సాయికుమార్, B.Sc. (Agriculture), Plantation Officer, JK Paper Mills; శిమ్మ వసంత - సురేష్, APIIC, Mangalagiri

మొయ్య కృష్ణారావు - లక్ష్మి (Deputy General Manager, State Bank of India (Rtd), Mumbai) - మొయ్య కౌశిక్, IIT (Dhanbad) & IIM (Kolkata) - Senior Data Scientist, Hyd.; మొయ్య సుష్మ (IIT -PhD) - పామోటి రామ్మోహన్‌రావు (IIT-Kharagpur) DM (R&D) Bajaj Auto Ltd., Pune

మొయ్య మున్నరావు - లక్ష్మి - మొయ్య షణ్ముఖ, M.Tech-NIT Rourkela, Civil Engineer-Planning (Meil)

మొయ్య రమణయ్య - సుగుణ - మొయ్య కిషోర్, Small Scale Business, మొయ్య దివ్య, B.Sc. (Agriculture)

కుమార్తెలు - అల్లుళ్లు - మనుమలు, మనుమరాండ్రు

పాగోటి సాయమ్మ (లేటు) - శిమ్మన్న - పాగోటి వెంకటరమణ - ధనలక్ష్మి, M.A, B.Ed, Teacher (Rtd); పాగోటి శ్రీను - రమణమ్మ (Agriculturist); మొయ్య సుగుణ - రమణయ్య (Agriculturist); కాయ జగది - గోవింద, Ex. Indian Army

చిన్నాల అన్నపూర్ణ - వెంకటరమణ (లేటు) - చిన్నాల శేఖర్ - జ్యోతి, Indian Rly., Visakhapatnam; పంగ గుణవతి - వెంకటరావు, Police Dept., VSP

చల్ల యశోద - ప్రభాకరరావు - చల్ల రాము - మాధవి, Software TCS-SBI Enterprises, Hyd.; సంధ్య - పైల శ్రీను, Branch Manager, APGVB

పాగోటి బాలబాబు - శిమ్మన్న - సతీష్, M.Tech, NIT, Asst. Professor, GVPCE, VSP - పోజన్య

పెద్దకర్మ: తే 15-07-2024 దిన మ॥ 12 గం॥ నుండి కూర్మనాథపురం నందు జరుపబడును.